అన్నవరం దేవస్థానం పరిచారికుడు సస్పెన్షన్

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవస్థానంలో పరిచారకుడు ఒకరిని సస్పెన్షన్ చేశారు. కొండపైన వనదుర్గ ఉపాలయంలో ఇద్దరు పరిచారికులు విధులు నిర్వహిస్తుంటారు. అయితే పరిచారకుడు చిట్టెం నగేష్ విధులు నిర్వర్తించకుండా అనధికారికంగా వేరొక వ్యక్తితో పని చేయిస్తూ గైర్హాజరు కావడం అధికారుల విచారణలో బయల్పడింది. దీనితో పరిచారకుడు నగేష్‌ను విధుల నుండి సస్పెన్షన్ చేసినట్లు ఎఇఒ ఎల్.శ్రీనివాస్ తెలిపారు. కాగా అక్కడ పనిచేస్తున్న ఇద్దరు పరిచారకులు కొన్నాళ్ల నుండి ఈ విధంగానే అనధికార వ్యక్తులతో పని చేయిస్తూ సెలవు పెట్టకుండా, విధులకు గైర్హాజరు అవుతూ, సంబంధిత అధికారులను మభ్యపెట్టడం చర్చనీయాంశమైంది.

కాకినాడలో అమర వీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అమరవీరుల ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - కాకినాడ

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేద్దామని మతవీరుల సభలో వక్తలు పిలుపునిచ్చారు. సమ సమాజం రావాలని ఆశిస్తూ కమ్యూనిస్టు పార్టీలో ప్రాణం ఉన్నంతవరకూ పనిచేసి అమరులైన ఇనుగంటి నారాయణ రావు, జియస్ బాలాజీ దాస్, తోరాటి లక్షణమూర్తి, వాసంశెట్టి సూర్యారావు, బిబి నాయిడు, గుండపు చిట్టియ్య, కుడిపూడి సూర్యనారాయణ, ఇనుగంటి రామతులసమ్మ, కామ్రేడ్ వాసంశెట్టి మాతాజీలకు సభలో ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా కన్వీనర్ మోర్తా రాజశేఖర్ మాట్లాడుతూ కష్ట జీవుల కష్టాలు కమ్యూనిస్టు ప్రభుత్వాల్లోనే తీరుతాయని నమ్మి అమరులైన వారికి జోహార్లు అర్పించారు. సుఖవంతంగా బ్రతకడానికి అన్నిఅవకాశాలు ఉన్నా వాటన్నింటినీ వదులుకొని ప్రజలకోసం పనిచేసిన ఇనుగంటి నారాయణ రావు, జియస్.బాలాజీ దాస్, తోరాటి లక్షణమూర్తి, వాసంశెట్టి సూర్యారావు తదితరులు అనేక మంది కమ్యూనిస్టు పార్టీలో త్యాగాలతో పనిచేశారన్నారు. ప్రజల్ని వంచిస్తున్న నేటి రాజకీయాలు ప్రజలకు తీవ్రమైన బాధలే మిగిల్చాయని, బాధల్లోఉన్న ప్రజల్ని సమీకరించి కమ్యూనిస్టులు కృషి చేయడమే అమరవీరులకు ఘనమైన నివాళి అని రాజశేఖర్ అన్నారు. చింతపల్లి అజయ్ కుమార్ మాట్లాడుతూ వాసంశెట్టి సూర్యారావు మృతి చెంది నాలుగు సంవత్సరాలు అయ్యిందన్నారు. సమాజగతినే మార్చిన కారల్ మార్క్స్ 140 వ వర్ధంతి కూడా ఈ కాలంలోనే జరుపుకుంటున్నా మన్నారు.సభ అనంతరం వర్తమానంలో మార్క్సిజం ఔనత్యంపై స్టడీ సర్కిల్ జరిగింది. కార్యక్రమంలో తిరుమల శెట్టి నాగేశ్వరరావు, ఉప్పాడ సత్యనారాయణ, టి.రాజా, సూరిబాబు, సిహెచ్.రమణి, శివరాజ్, వి.చంద్రరావు, సిహెచ్. రమణ, గుత్తుల రామక్రిష్ణ, గుత్తుల రామలింగేశ్వర రావు, నాగదేవి, భాస్కర్, పద్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.

కొత్తగా 14 బోద వ్యాధి కేసులు గుర్తింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం బోధవ్యాధి నివారణ కేంద్రం పరిధిలో ఈ ఏడాది జనవరి నెల నుండి ఇప్పటివరకు కొత్తగా 14 మందికి బోధవ్యాధి సోకినట్లు గుర్తించామని బోద నివారణా కేంద్రం ఇంచార్జ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పెద్దాపురం మండల పరిధిలోని కట్టమూరు, పులిమేరు, దివిలి, కాండ్రకోట, సామర్లకోట మండల పరిధిలోని పెద్ద బ్రహ్మదేవం గ్రామాలలో ఈ కొత్త కేసులు గుర్తించామన్నారు. అత్యధి కంగా కట్టమూరులో 5 కేసులు నమోదయ్యాయన్నారు. ప్రతి గురువారం ఈ కేంద్రానికి 150 నుండి 200 మంది వస్తున్నారని, వారికి పరీక్షలు చేసి, మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. గురువారం రాత్రి 8 నుండి 9 గంటల మధ్యలో బోదవ్యాధి అనుమానిత కేసులకు సంబంధించి రక్త పరీక్షలు చేస్తున్నామన్నారు. ప్రతి నెల 3వ తేదీ నుండి 10వ తేదీ వరకు నివాసప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి 340 మంది నుండి రక్త నమూనాలు సేకరించి లేబరేటరీలో పరీక్షలు చేస్తున్నామన్నారు. వ్యాధి నిర్ధారణ అయినవారికి మందులు అందజేస్తున్నా మని తెలిపారు.

చివరి బడ్జెట్‌లోనూ నిరాశే..

- ఉమ్మడి జిల్లాలో వేధిస్తున్న ప్రధాన సమస్యలు
- పోలవరాన్ని విస్మరించిన సర్కారు
- కోటిపల్లి రైల్వే పనులకు నిధులు నిల్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్ మరోసారి జిల్లా వాసులను నిరాశపరిచింది. ఉమ్మడి జిల్లాకు తగిన నిధులు కేటాయించకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న పోలవరం ప్రాజెక్టును గాని ఇతర సాగునీటి ప్రాజెక్టుల రంగానికి గానీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదు. కోనసీమ రైల్వే లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించాల్సి ఉంది. దానికి కూడా నిధులు కేటాయించలేదు. ముఖ్యమైన పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. కేవలం గతంలో మంజూరు చేసిన ఉప్పాడ హార్బర్ పనులను మాత్రమే బడ్జెట్లో ప్రస్తావించారు. గోదావరి డెల్టా ఆయకట్టులో వేసవిలో నీటి లభ్యత సమస్య తీవ్రంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో గోదావరి డ్రైన్ల ఆధునీకరణ పనుల చేయాల్సి ఉన్నా నిధులు కేటాయించలేదు. ఇలా పలు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో జిల్లా వాసులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్ల ఆధునీకరణకు గతేడాది రూ.61 కోట్లు కేటాయించారు. నిధులు కొరత వల్ల ఈ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. ఈ బడ్జెట్లో కూడా నిధులు కేటాయింపు లేదు. దాదాపు 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే కీలకమైన గేట్ల ఆధునీకరణను విస్మరించడంతో ఉమ్మడి జిల్లా వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరిలో ఇసుక పూడిక పనులు చేయడానికి గతంలో టెండర్లు పిలిచినా నేటికి బడ్జెట్లో నిధులు కేటాయించలేదు. జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక (ఎన్ఆర్‌సిపి) కింద 'గోదావరి నది కాలుష్య నివారణ, పరిరక్షణ' ప్రాజెక్ట్ కోసం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 2022లో రూ.88.43 కోట్లు మంజూరు చేసింది. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.416 కోట్లుగా అంచనా వేశారు. కానీ కేంద్రం రూ.88.43 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో సంయుక్తంగా చేపట్టాలి. రాష్ట్ర వాటా నేటికీ కేటాయించలేదు. పారిశ్రామిక అభివద్ధి, ఉపాధి కల్పన ఊసే ఎత్తలేదు. పోలవరం నిర్వాసితులకు ఎకరాకు రూ.5 లక్షల చొప్పున పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.6.50 లక్షలకు బదులు రూ.10 లక్షల ఇస్తామని ముఖ్యమంత్రి జగన్ గతంలో హామీ ఇచ్చారు. కానీ ఈ బడ్జెట్లో చిల్లి గవ్వ కూడా కేటాయించలేదు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించడంతో జిల్లా రైతాంగం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో కీలకమైన వైద్యుల పోస్టుల భర్తీకి సంబంధించి ఎటువంటి ప్రస్తావనా రాలేదు. యువతకు ఉపాధి కల్పించే రంగాన్ని విస్మరించారు. స్థూల ఆదాయంపై అంకెల గారడీ వినిపించారు. ఇళ్ల నిర్మాణానికి కేటాయింపులు సాధారణంగానే ఉన్నాయి. ప్రభుత్వం ఇస్తున్న అరకొర సొమ్ములు లబ్ధిదారులు కనీసం పునాదులు కట్టుకోవడానికి కూడా సరిపోని పరిస్థితులు ఉన్నాయి. ఈ బడ్జెట్‌లోనైనా తగిన నిధులు కేటాయిస్తారని లబ్ధిదారులు ఆశించి బంగాపడ్డారు.

నాలుగేళ్లయినా రాష్ట్ర వాటా ఏదీ.?

కీలకమైన కోటిపల్లి - నర్సాపురం రైల్వే లైను పూర్తి కావడం కోసం కోనసీమ ప్రజానీకం 20 ఏళ్లుగా ఎదురు చూస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దఫ దఫాలుగా రైల్వే బడ్జెట్‌లో మొత్తం రూ.1100 కోట్లు కేటాయించింది. మొత్తం నిర్మాణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటా ఇవ్వాల్సి ఉంది. ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాకు సంబంధించిన నిధులు కేటాయింపు చేయని కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. సుమారు రూ.350 కోట్లు రాష్ట్ర వాటా ఇవ్వాల్సి ఉన్నా ఈ బడ్జెట్ లో కూడా ఒక్క రూపాయి కేటాయించలేదు.

కీలక సమస్యలకు పరిష్కారం ఎప్పటికీ.?

విశాఖ-కాకినాడ మధ్య పెట్రో రసాయనాల పెట్టుబడుల కేంద్రం రాలేదు. కాకినాడ సెజ్‌లో నేటికీ పరిశ్రమల ఊసే లేదు. జిల్లా వాసుల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే జల్ జీవన్ మిషన్ పనుల వేగవంతానికి అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో కేటాయించ లేదు. జిల్లాలో పలు రహదారుల పనులకు భారీగా సొమ్ములు కేటాయింపులు జరగాల్సి ఉన్నా పట్టించుకోలేదు. కాకినాడలో విడుదలయ్యే 50 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు రూ.10 కోట్లు వెచ్చించారు. కానీ నిధులు కేటాయించడం లేదు. కాకినాడలో సైన్స్ సెంటర్, గోదావరి కళాక్షేత్రం, స్టేడియం నిర్మాణం వంటి పనులకు సుమారు రూ.25 కోట్లు నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాల్సి ఉన్న దానినీ పట్టించుకోలేదు. ఏలేరు కాలువల ఆధునీకరణకు నిధుల కేటాయింపు ప్రస్తావన రాలేదు.

కోనసీమకు మొండి చేయి

నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా ఏర్పడిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అభివద్ధి కోసం ఏ రకమైన నిధులూ బడ్జెట్లో కేటాయించలేదు. ప్రధానంగా రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన అడా (అమలాపురం అర్బన్ డెవలప్మెంట్‌కి) నిధులు కేటాయించలేదు. అనేక సంవత్సరాలుగా పారిశ్రామిక రంగానికి దూరంగా ఉన్న ఈ జిల్లాని ఆ దిశగా అభివృద్ధి చేయాలని ఆలోచన ఏ కోశానా కనబడలేదు. కోనసీమలో ఇరిగేషన్ డ్రెయినేజీల అభివద్ధి కోసం నిధులు కేటాయించలేదు. ఈ జిల్లాలో రూ.1.36 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతుంది. కొబ్బరి సాగులో రాష్ట్రంలోనే జిల్లాది మొదటి స్థానం. ఇక్కడి ఉత్పత్తుల విలువ సుమారు రూ.736 కోట్లుగా ఉండగా ప్రత్యక్షంగా లక్ష మంది, పరోక్షంగా మరో 3 లక్షల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. అయితే కొబ్బరి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారని ఆశించిన జిల్లా వాసులకు నిరాశే మిగిలింది. జిల్లాలో 22 మండలాల్లో 20 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. అయితే ఇక్కడ సరైన వైద్య సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం అమలాపురంలో వైద్యసేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాల్సి ఉన్నా బడ్జెట్ కేటాయింపులు లేవు. అమలాపురం రూరల్ సమసనలో సుమారు రూ.500 కోట్లతో ఆసుపత్రి మంజూరైనా నిధుల కొరత వేధిస్తోంది.

స్వయం సమృద్ధి ఎలా సాధ్యం : సిపిఎం

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఎన్నికల బడ్జెట్ తప్పితే రాష్ట్ర స్వయం సమద్ధి సాధించే విధంగా కేటాయింపులు లేవని సీపీఎం జిల్లా కమిటీ తెలిపింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం. రాజశేఖర్ ప్రకటన విడుదల చేశారు. ఎస్ సి, బీసీ జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపు లేవని కేవలం అంకెల గారడీగా ఉందని రాజశేఖర్ తెలిపారు. జిల్లాలోని స్థానిక వనరులు ఉపయోగ పెట్టి అభివృద్ధి కి, ఉపాధి అవకాశాలకు బాటలు వేయాల్సిన బడ్జెట్ అటు వైపు దృష్టి సారించలేదని రాజశేఖర్ విమర్శించారు. కాకినాడ జిల్లాలో వున్న అనేక వనరులు ఉపయోగించే ప్రణాళిక పాలకుల వద్ద లేదని, వనరులను దోపిడీ దారులకు దోచిపెట్టే పద్ధతులు మాత్రమే అమలు చేస్తున్నారని. ఉపాధి హామీ పథకం నిధులు మెటీరియల్ కాంపోనెంట్ పెంచి ఉపాధి నిధులు హౌసింగ్ లబ్ధిదారులుకు కట్టబెడుతూ బడ్జెట్ కేటాయింపులు చేశారని అన్నారు. వ్యవసాయంలో వాస్తవ సాగుదారులుగా ఉన్న కౌలు రైతులకు ఏ రకమైన హామీని బడ్జెట్ ఇవ్వలేదని సీపీఎం తెలిపింది.

18న వికాసలో జాబ్ మేళా

ప్రజాశక్తి - కాకినాడ

డబ్ల్యుఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీలో నాన్ వాయిస్ (హెల్త్ కేర్) ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉద్యోగానికి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 30 ఏళ్ల లోపు స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. టైపింగ్ స్పీడ్ 30 డబ్ల్యూపిఎం ఉండాలన్నారు. వీరికి ఏడాదికి 1.8 లక్షలు జీతం, ఇన్సెంటివ్స్ ఉంటాయన్నారు. ఈ ఉద్యోగానికి ఎంపికైనవారు విశాఖపట్నంలో పనిచేయాల్సి ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 18వ తేదీ శనివారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో ఉన్న వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు.

సంపద కేంద్రాలతో ఆదాయం పెంచాలి

ప్రజాశక్తి - పెదపూడి

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో గ్రామ సచివాలయాలకు అదనపు ఆదాయం పెంచడానికి కార్యదర్శి, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఇఒపిఆర్‌డి కె.హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. కాండ్రేగులలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించి ఈషెడ్ చుట్టు ప్రహరీగోడ నిర్మాణం చేపట్టాలన్నారు. వర్మీ కంపోస్టు ఎరువు రైతులకు నిబంధనల ప్రకారం విక్రయం. చేపట్టాలన్నారు. వివిధ రకాల పండ్ల మొక్కలు, కొబ్బరి, అరటి, బీర, ఆనప మొదలగు కాయ, ఆకు కూరలు పండించి సచివాల యానికి అదాయం పెంచాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.వి.వి.సత్య నారాయణ, సచివాలయం కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆర్ ఏ బిహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షకు వెళుతున్న విద్యార్థులు

సెకండ్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం సజావుగా ప్రారంభమ య్యాయి. మొదటిరోజు లాంగ్వేజ్-2 (తెలుగు, హిందీ, సంస్కతం), వృత్తివిద్య వారికి జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు జిల్లా నుంచి 17,434 మందికి 16,934 మంది, వృత్తివిద్య 1217 మందికి 1174 మంది హాజరైనట్లు డీవీఈవో జీజీకే నూకరాజు తెలిపారు. ఇందుకోసం 60 కేంద్రాలు కేటాయించామన్నారు. జిల్లాలోని పలు కేంద్రాలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. **పిఠాపురం** : ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష గురువారం ప్రశాంత గా జరిగింది.పట్టణంలో ఇంటర్ పరీక్ష నిర్వహణ 4 కేంద్రాలుల్లో జరగగా ఆర్ ఆర్ బిహెచ్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 370 మంది కి గాను 359 విద్యార్థులు, హనుమంతరాయ కళాశాలలో 272 మందికి 256, అంజనా కళాశాలలో 176 మందికి 171, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల కళాశాలలో 254 మందికి 233 మంది హాజరు కాగా 53 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు,మహిళ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆయా పరీక్షా కేంద్రాలు వద్ద 144 వ సెక్షన్ అమలు చేశారు.

హాల్ టికెటు ఇవ్వడంలో జాప్యం

ఆలస్యంగా వచ్చి పరిక్ష రాయలేకపోయిన విద్యార్థిని

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్ష కేంద్రం కొనసాగుతుండగా పెద్దాపురం మండలం మర్రిపూడి గ్రామానికి చెందిన కె.సునీత అనే విద్యార్థిని 40 నిమిషాల ఆలస్యంగా పరీక్ష కేంద్రం వద్దకు చేరుకుంది. సమయం బాగా ఆలస్యం కావడంతో పోలీసు సిబ్బంది అయిన ఎఎస్ఐ సింహాద్రి ఆమెరు పరీక్ష హాలుకు వెళ్లేందుకు అనుమతించలేదు. దాంతో విద్యార్థిని తీవ్ర ఆందోళనలకు గురైంది. ఈ సందర్భంగా విద్యార్థులు మీడియా ప్రశ్నించగా తాను పెద్దాపురం సాగర్ జూనియర్ కళాశాలలో చదువుతున్నానని తమ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లించలేక పోయామన్నారు. అయితే కళాశాల నుంచి టీసి ఇతర పత్రాలు తీసుకు వెళ్లే సమయంలో మొత్తం ఫీజు చెల్లిస్తామని, ప్రస్తుతం పరీక్షకు ఇబ్బంది కలగకుండా హాల్ టికెట్ ఇవ్వాలని గత మూడు రోజులుగా విద్యార్థిని సునీత కళాశాల యాజమాన్యాన్ని బతిమలాడినా వారు ఇబ్బందులకు గురిచేస్తూ పరీక్ష సమయం దాటిన తరువాత హాల్ టికెట్ చేతికి అందించారని విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేసింది. దానితో ఎంతో ప్రయాసపడి ప్రయత్నించినా పరీక్ష కేంద్రానికి చేరుకునేందుకు బాగా ఆలస్యమైందని విద్యార్థిని కన్నీటి పర్యాంతమైంది. ఎంతో ప్రయాస పడిన పరీక్ష రాసే అవకాశం లేనందున సంవత్సరకాలం తమ వధా అయిందని విద్యార్థి విలపిస్తూ వెనుదిరిగింది.

సమావేశంలో పాల్గొన్న జెసి ఇలాక్కియా, జిల్లా అధికారులు

రెండో దశ రీ సర్వే పూర్తి చేయాలి

- జగనన్న శాశ్వత భుహక్కు భూ రక్ష పథకంపై సమీక్ష

ప్రజాశక్తి - కాకినాడ

భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా చేపట్టిన జగనన్న శాశ్వత భుహక్కు భూ రక్ష పథకానికి సంబంధించి రెండో దశ రీ సర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి శుక్రవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష రీ సర్వే, జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ, నవ రత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో చేపట్టిన లేఅవుట్, గృహనిర్మాణంలో పురోగతి, పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖకు సంబంధించి స్వచ్ఛ సంకల్పం, స్వామిత్వ, స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించి యువతకు శిక్షణ కార్యక్రమాలు గ్రామ, వార్డు సచివాలయాల్లో స్పందన, గడప గడపకు మన ప్రభుత్వం అర్జీల పరిష్కారం ఇతర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై సీఎస్ జవహర్ రెడ్డి కలెక్టర్లతో సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డి, జడ్‌పి సీఈవో ఎన్.వి.వి. సత్యనారాయణ, కాకినాడ కమిషనర్ కె రమేష్, సీపీవో పి.త్రినాథ్, డ్వామా పీడీ ఎం.వెంకట లక్ష్మి డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్, డీపీవో ఆర్. విక్టర్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్లు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్ విద్యార్థులతో యుటిఎఫ్., ఎస్ఎఫ్ఐ నాయకులు

సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు టెస్ట్ పేపర్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) సహకారంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్ విద్యార్థులకి మోడల్ టెస్ట్ పేపర్స్ ను గురువారం పంపిణీ చేయడం జరిగింది. ఎస్ఎఫ్ఐ కాకినాడ నగర కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏబిసిడబ్ల్యు టీ.ప్రసాద్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మహేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.రాజా విచ్చేసి సంయుక్తంగా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో విద్యార్థిని విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో ఈ టెస్ట్ పేపర్లను సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ప్రణాళిక బద్ధంగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫ్లోరెన్స్, సరస్వతి, ఉషారాణి, జయసుధ, బహదూర్, యుటిఎఫ్ కాకినాడ నగర అధ్యక్షులు వరహాలు, ఎస్ఎఫ్ఐ నాయకులు శివరాజు, అరుణ్, వీరేశ్వరి పాల్గొన్నారు.

కార్టూన్'నిజం'



బోగస్‌వా సార్..!

అమరజీవికి నివాళి

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని ఆయన త్యాగ నిరతకి తెలుగు ప్రజలు అంతా రుణపడి ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని ముఖ్యకేంద్రాల్లో పొట్టి శ్రీరాములు విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి జిల్లాలో నాయకులు, అధికారులు, పాఠశాలల్లో విద్యా కమిటీల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన నివాళులర్పించారు.

కాకినాడ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రామారావుపేట, సీబీఎం స్కూల్-ఫెలోషిప్ సెంటర్‌లో ఉన్న పొట్టి విగ్రహానికి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జాయింట్ కలెక్టరు ఎస్.ఇలాక్కియా, జడ్‌పి సిఇఒ ఎన్.వి.వి.సత్యనారాయణ, కుడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో గాంధీజీ అడుగు జాడల్లో పయనిస్తూ భాషాప్రయుక్త రాష్ట్రాల కింద తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు చిన్న వయసులోనే ఆమరణ దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించి స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. జాయింట్ కలెక్టరు ఎస్. ఇలక్కియ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు లాంటి మరో పది మంది వ్యక్తులు ఉంటే భారతదేశానికి మరింత తొందరగా స్వతంత్రం సిద్ధించేదని గాంధీజీ పేర్కొన్నట్లు జేసీ తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి సత్య రమేష్, కాకినాడ ఆర్‌డిఒ బీవీ రమణ, ఇతర అధికారులు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. **కాకినాడ కార్పొరేషన్**: కాకినాడ ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ బివి రమణ, సిబ్బంది అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **కాకినాడరూరల్** సర్పవరం జంక్షన్ లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఎస్. శ్రీ నగేష్, అడబాల రత్న ప్రసాద్, రేలంగి బాపిరాజు, బుద్ధ రాజు సత్యనారాయణ రాజు, ఓం నమశ్శివాయ, రాఘవరావు తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. **కోటనందూరు** జడ్‌పి హై స్కూల్‌లో చైర్మన్ ఉల్లూరి శ్రీను ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ జయలక్ష్మి ఉపాధ్యాయుల విక్టర్ నాగేశ్వరరావు ప్రధానోపాధ్యాయులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. **సామర్లకోట రూరల్** మండల పరిషత్ కార్యాలయం, ఎంపిడిఒ కార్యాలయాల్ల పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి శ్రీలలిత, ఎంపిడిఒ కార్యాలయం ఎఒ విప్పర్తి వీరసాయిబాబు, ఎంఇఒ వై శివరామకృష్ణయ్య, మండల ఇంజనీరు కె మణిమాల, ఎపిఎం ప్రశాంతి కుమారి, ఇన్‌చార్జి ఇఒపిఆర్‌డి వై శ్రీహరి, కాంట్రాకర్ల అసోసియేషన్ అధ్యక్షులు అమజాల దొరబాబు, మండల పరిషత్ సిబ్బంది, అదేవిధంగా తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె లక్ష్మినరసకుమారి, డిప్యూటీ తహశీల్దార్ ఆర్. శ్రీనివాసు, ఆర్ఐ రాజేష్, విఆర్ఒలు, సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు. **పెదపూడి** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కేతా తులసి, జడ్‌పిటిసి పేపకాయల వెంకటలక్ష్మి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.విజయభాస్కర్, ఇఒపిఆర్‌డి కె. హరికష్ణ సత్యరెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీఓ నాగమణి, కాండ్రేగుల ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ. రాజమహేంద్ర వరం పార్లమెంటు బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలం లింగంపర్తి, ఏలేశ్వరం గ్రంథాలయాలలో గ్రంథాలయ అధికారి కవికొండల సత్యనారాయణ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సూర్యనారాయణలు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాబులు, ఊర వీరభద్రరావు, గొంతిరెడ్డి శ్రీనివాస రావు, ఆశపు చిట్టిబాబు, పొట్టపల్లి రాజేష్ పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రాయుడు సునీత ఆధ్వర్యంలో ఎంపిడిఒ ఎం.అనుపమ, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. **పెద్దాపురం** మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జై సురేంద్ర ఆధ్వర్యంలో, ఎండిఓ కార్యాలయంలో ఎండిఓ కరక హిమ మహేశ్వరి ఆధ్వర్యంలో, వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో సినిమా సెంటర్లోని, కంచర వీధిలోని పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి బంగతాయారు,వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్,కనకాల మహాలక్ష్మి,మున్సిపల్ కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు,వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న జడ్‌పి చైర్మన్ వేణుగోపాలరావు

లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆందోళన

ప్రజాశక్తి - పెద్దాపురం

పాత లారీ ఓనర్స్ అసోసియేషన్ తమకు పనులు కల్పించక పోవటంతో తాము ఎన్నో అవస్థలు పడుతున్నామని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నూతన లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దాపురం- సామర్లకోట ఏడిబి రోడ్ లో ఆందోళన చేపట్టారు. తాము గత కొన్ని నెలల క్రితం నూతన యూనియన్ ఏర్పాటు చేశామని, పాత యూనియన్ నేతల వేధింపుల వల్ల పనులు లేక వాయిదాలు చెల్లించలేక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నామన్నారు. అధికారులు కలగజేసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మారిశెట్టి రామాంజనేయులు, కార్యదర్శి నడిపూడి రమణ, సహాయ కార్యదర్శి గంగోలు రామకృష్ణ, కోశాధికారి సింహాద్రి రాజు, బిందుకుర్తి పాండురంగ, లోవరాజు, నక్కిన రమణ, అవుగొడ్డు వీరబాబు, మోర్త నాని బాబు, జోకా నాగేశ్వరరావు, గోవిందు, హరి, వెంకట్, రమేష్,బాబ్జి, ఆది తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

నేరాలు ఘోరాలు

బియ్యం లారీ అదృశ్యం కేసులో మరొకరి అరెస్ట్

ప్రజాశక్తి - యానాం

యానాం శివారు అడవి పొలంలో గాయత్రి రైస్ మిల్ నుంచి ఫిబ్రవరి రెండో తారీఖున 28 టన్నుల ఉప్పుడు బియ్యం లోడుతో కేరళ రాష్ట్రానికి బయలుదేరిన లారీ కనిపించకపోవడంతో రైస్ మిల్ యజమానులు ఫిర్యాదు మేరకు యానాం పోలీస్ స్టేషన్లో ఎస్ఐ శేరు నూకరాజు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ కట్టా సుబ్బరాజు ఆధ్వర్యంలో క్రైమ్ టీం ఛేదించి లారీ డ్రైవర్ బి.బాబు, క్లినర్ రజకలై గణేషన్ ను తమిళనాడు రాష్ట్రానికి చెందిన సెలియంపాలెంలో అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి సబ్ జైలుకు తరలించారు. అనంతరం లారీని స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఎస్పి బి.రఘునాయగన్, నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ షణ్ముగం ఆదేశాల మేరకు ఎస్ఐ కట్టా సుబ్బరాజు టీం మరోసారి కేరళ ప్రాంతానికి బయలుదేరి మరో నిందితుడు సతీష్ (గిబ్స్)ను అదుపులోకి తీసుకున్నారు. 13 లక్షల విలువగల బియ్యాన్ని కేవలం రూ.5 లక్షలకు అమ్మేసినట్లు తెలుసుకున్న పోలీసులు సతీష్ నుంచి రూ.4లక్షల40వేలు , 250 కేజీల బియ్యం స్వాదీనం చేసుకుని కోర్టులో హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధించి సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ షణ్ముగం మాట్లాడుతూ రైస్ మిల్ యాజమాన్లు, లారీ ఓనర్లు తమ దగ్గర పని చేసే లారీ డ్రైవర్లు క్లీనర్ల సరైన ఆధారాలు సేకరించిన తర్వాతే ఎగుమతి చేసుకోవాలని కోరారు. అనంతరం క్రైమ్ టీంను అభినందించారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామ శివారులో నల్లచెరువు గట్టుపై గడ్డిలోడుతో బయటికి వస్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో చుట్టుపక్కల రైతులు అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి మంటలు అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఇంతలో అగ్నిమాపక సిబ్బంది కె.నీలమయ్య, ఎల్ఎస్ ఆర్ చంద్రశేఖర్, ఎల్ సుధాకర్, పి సంతోష్ వచ్చి మంటలు అదుపు చేసి సుమారు రూ.50వేల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు.

వేధింపులు తట్టుకోలేక ఇద్దరు విద్యార్థుల అదృశ్యం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరంలో బిసి హాస్టల్లో ఎనిమిదవ తరగతి చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థులు వేధింపులు తట్టుకో లేక అదృశ్యమయ్యారు. వీరిద్దరూ కె.గంగవరం నుంచి యానాం సమీపాన గల కోలంక గ్రామం చేరుకుని అక్కడ ఎంచ్చాడుతుండగా కొందరు గ్రామస్తులు వారిని వివరాలను అడిగారు. హాస్టల్లో వార్డును ఇతర సిబ్బంది వేధింపుల వల్ల బయటకు వచ్చేసినట్లు వారు తెలిపారు. ఒక విద్యార్థి పాతకోట గ్రామం, మరో విద్యార్థిది ఆరిక రేవుల గ్రామం. విషయం తెలుసుకున్న గ్రామస్తులు శ్రీనివాసరావుకు సమాచారం అందించడంతో గురువారం సిబ్బందితో వెళ్లి విద్యార్థులను హాస్టల్‌కు తీసుకు వచ్చినట్లు సమాచారం.

విద్యార్థులను తీసుకువచ్చాం

దీనిపై హాస్టల్ వార్డెన్ అబ్బిరెడ్డి శ్రీనివాసరావును వివరణ కోరగా విద్యార్థులను తీసుకువచ్చేశామని, విద్యార్థులను వేధించవలసిన అవసరం తనకు ఉండదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ మేరకు సమాచారం అందించామని, శుక్రవారం ఉదయం దీనిపై తగు చర్యలు చేపడుతున్నామని వివరించారు.

బాలుని అపహరణపై కేసు

ప్రజాశక్తి-మండపేట

జెడ్.మేడపాడు బస్ షెల్టర్ వద్ద బాలుడి అపహరణపై తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి.. పంతాడి సూరిబాబు భార్య చిన్నారి వారి ఇద్దరు కుమారులతో కలిసి జెడ్. మేడపాడు వంతెన వద్ద వున్న బస్ షెల్టర్‌లో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి 2 గంటల సమయంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు షెల్టర్ దగ్గరకు వచ్చి చిన్నారులను అనుమానాస్పదంగా చూస్తున్నారు. చిన్నారుల తల్లిదండ్రులు ఇక్కడ ఏం చేస్తున్నారని ఆ వ్యక్తులను ప్రశ్నించగా వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరలా బుధవారం ఉదయం ఎవరు లేకపోవడం చూసి ప్రభు అనే మూడేళ్ల చిన్నారిని అపహరించుకుపోయారు. ఇది గమనించిన తల్లిదండ్రులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బల్లా శివకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న స్కూల్ బస్సు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వేలివెన్ను శశి విద్యాసంస్థల బస్సు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో విద్యార్థులు గాయాల పాలయ్యారు. గురువారం తణుకులో ఇంటర్ పరీక్ష రాసి వేలివెన్నుకు వస్తున్న విద్యార్థులు ప్రయాణిస్తున్న బస్సు మునిపల్లి నుండి వేలివెన్ను మార్గంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 15 మంది విద్యార్థినులు స్వల్ప గాయాలతో బయటపడగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మిగతా విద్యార్థినిలను తణుకు పట్టణంలోని వివిధ ప్రైవేట్ ఆస్పత్రిలలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఉండ్రాజవరం పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సును ఢీ కొన్న ఆటో

ప్రజాశక్తి-గోకవరం

బస్సును ఆటో ఢీకొని ముగ్గురు మహిళలుకి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన కలవలపల్లి గంగ మరో ఇద్దరు మహిళలు ఆటోలో గోకవరం వస్తున్నారు. అయితే రాజుపాలెం గ్రామం వద్ద గోకవరం నుండి అడ్డతీగల వెళ్తున్న ఆర్‌టిసి బస్సును ఆటో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళలు గాయపడినట్లు తెలియ వచ్చింది క్షతగాత్రులను 108లో గోకవరం ప్రభుత ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ కాలుకి స్వల్ప గాయాలయ్యాయి

ఎటిఎం లో చోరీకి విఫల యత్నం

ప్రజాశక్తి - సామర్లకోటరూరల్

మండలం లోని జీ.మేడపాడులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో చోరీకి విఫల యత్నం జరిగినట్టు సామర్లకోట పోలీసులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి సుమారు 11:30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియం వ్యక్తులు జి.మేడపాడులో ఉన్న ఎస్‌బిఐ ఎటింఎను కొల్లగొట్టడాఁకి ప్రయత్నించారు. బ్యాంక్ మేనేజర్ కఁగిరి కృష్ణమౌళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘ టన స్థలానికి సామర్లకోట సిఐ కె.దుర్గా ప్రసాద్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకటేశ్వరరావు

ఆకతాయిలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కొంతమంది తల్లిదండ్రులను బెదిరించి,భయపెట్టి అధిక వేగంతో వెళ్ళే మోటారు సైకిళ్లు కొనిపించుకుని, వాటి ద్వారా నగరంలో ట్రాఫిక్ పోలీసులు కాపాలా లేని ప్రదేశాలలో అధిక వేగంతో ప్రయాణిస్తూ ప్రజలను ఇబ్బందులు పెట్టడం ఆకతాయిలకు పరిపాటిగా మారిందనిఎం డిఎస్‌పి ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఆకతాయిలను కాకినాడ ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకుని గురువారం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కాకినాడ ట్రాఫిక్ డిఎస్‌పి ఎం వెంకటేశ్వరరావు, సిఐ డి చైతన్య కృష్ణ గురువారం ట్రాఫిక్2 పోలీసు స్టేషన్లో దీనికి సంబంధించిన సమాచారం విలేకరులకు తెలియజేశారు. అంతే కాకుండా ట్రాఫిక్ ఆఫ్ డేట్ పేరుతో 800 మంది వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకుని, ట్రాఫిక్ పోలీసుల కదలికలు ఎప్పటికప్పుడు పంచుకుంటూ, పోలీసుల కళ్ళు కప్పి ప్రయాణం చేయడం, పోలీసుల మీద అసభ్య పదజాలంతో దూషించడం వంటి మెసేజులు పెట్టడంవంటివి ఈ గ్రూపులు లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. ఇటువంటి గ్రూపులు ఎనిమిది ఏర్పాటు చేసుకుని, సుమారు ఐదువేల మంది యువకులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్ర మించి అధిక వేగంతో ప్రయాణం చేస్తున్న సంగతి తమ దృష్టికి వచ్చిందన్నారు. వీరిలో చాలామందికి డ్రైవింగ్ లైసెన్సు లేవని, పోలీసు కేసుల నుంచి తప్పించుకోవడానికి నెంబర్ పెట్లు తొలగించడం, మైనర్లు డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు చేస్తున్నారని తెలిపారు. ఇందులో ఓ గ్రూపుకు సంబంధించిన కొంతమందిని అదుపులోకి తీసుకుని వారి తల్లిదండ్రుల సమక్షంలో మొదటి తప్పుగా పరిగణించి, కౌన్సెలింగ్ ఇచ్చామని డిఎస్‌పి వెంకటేశ్వరరావు తెలిపారు. మళ్లీ ఇటువంటి చర్యలు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

సచివాలయ ఉద్యోగుల నూతన కమిటీ

ప్రజాశక్తి - సామర్లకోట

అధ్యక్షుడు మేక జోగారావు

కార్యదర్శి సింగరాజు

గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక గురువారం సాయంత్రం సచివాలయ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్రి సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షులుగా మేకా జోగారావు, జనరల్ సెక్రటరీగా సింగరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వాగ్య వెంకట నాయక్, వైస్ ప్రెసిడెంట్‌గా పిట్ట మహేష్ బాబు, జాయింట్ సెక్రటరీగా ధనరాశీ సుధీర్, జాయింట్ సెక్రటరీ 2గా పి.శ్రీదేవి, కోశాధికారిగా మలిరెడ్డి గనిలక్ష్మీ, జాయింట్ కోశాధికారిగా ఎం.మణికంఠ, ఎనిమిది మంది సభ్యులతో ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్రి సుబ్బరామి రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలన్నారు.

వాలంటీర్లకు అవగాహన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వాలంటీర్లకు మానసిక రుగ్మతలు ఉన్నవారిని గుర్తించడం, వారికి ప్రభుత్వ సేవలందించడం అనే అంశాలపై కాకినాడ ఉమా మనో వికాస కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సును ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలితలు ప్రారంభించారు. మనోవికాస కేంద్రం మానసిక రుగ్మతలున్నవారి చట్టాలను వివరించి పలు గోడ పత్రికలను, కర పత్రాలను ఎంపిపి సత్తిబాబు, ఎంపిడిఒ శ్రీలలితలు ఆవిష్కరించారు. ఎఒ వివీరసాయిబాబు, అనూష స్వాతి, మధుకుమార్, నాగమల్లి జీవ, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లింపులో రాయితీ లేదు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలో ఇంటి పన్ను చెల్లించేవారు మార్చి 31లోగా చెల్లించాలని ఎటువంటి రాయితీ ప్రభుత్వం ప్రకటించలేదని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ సత్యనారాయణ వెల్లడించారు. గురువారం పిఠాపురం మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. పన్నులు వసూళ్ల ఇతర అంశాలపై ఆరా తీశారు. ఇప్పటివరకు 60 శాతం పన్ను వసూలు జరిగాయని మార్చి 31 నాటికి 85 శాతం వసూలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రీజియన్ పరిధిలో 65 శాతం వసూళ్లు ఇప్పటికే జరిగాయని 90 శాతం జరుగుతాయన్నారు. మున్సిపాలిటీలు పరిధిలో డబుల్ ఎంట్రీ ఇంటి పనులు ఏమైనా ఉంటే కౌన్సిల్ అనుమతులతో కమిషనర్ నేరుగా తొలగించవచ్చన్నారు. రీజియన్ పరిధిలో ఉన్న ఉయ్యూరు మున్సిపాలిటీ పన్నుల వసూళ్లలో చివరి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. అలాగే ఆర్‌ఆర్ బి హెచ్‌ఆర్ ప్రభుత్వ కళాశాల ఖాళీ స్థలం రికార్డులను తనిఖీ చేశారు. ఈ స్థల వివాదం హైకోర్టు పరిధిలో ఉన్నట్లు ఆయన తెలిపారు. అలాగే రాష్ట్రంలో అన్ని పట్టణాల్లో రీ సర్వే డ్రోన్ల ద్వారా జరుగుతుందని వందేళ్ల నాటి ఆర్‌ఎస్‌ఆర్ సర్వేకి అనుగుణంగా నూతనంగా సర్వే చేసి ప్రతి ఇంటికి గృహహక్కు పత్రం ఇవ్వనున్నట్లు ఆర్‌డి తెలిపారు. పట్టణంలో చెత్త పై యూజర్ చార్జీలు వసూలు చేసి క్లాప్ క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో ఏజెన్సీ ఏర్పాటు చేసి వారి ద్వారా చెత్తను సేకరించడం జరుగుతుందన్నారు. రెండో దశలో యూజర్ చార్జీలు వసూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మాగాపు రామ్మోహన్, ఆర్ఒ శ్యామల, ఆర్ ఐ నవీన్ తదితరులు ఉన్నారు..

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రానున్న వేసవి లో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే.రమేష్ చెప్పారు. గురువారం ఆయన వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి అరట్లకట్ట వేసవి జలాశయాన్ని, సామర్లకోట సాంబమూర్తి రిజర్వాయర్‌ను సందర్శిం చారు. గోదావరి జలాల లభ్యత, నీటినిల్వల సామర్థ్యం,వేసవి కార్యాచరణ పై ఆయన అధికారులతో చర్చించారు. అరట్లకట్టలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. ఈ నెల 25వ తేదీ నాటికల్లా డి-సిల్టేషన్ పనులు పూర్తి చేసి వేసవి జలాశయంలో వీటిని నింపేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సామర్లకోట సాంబమూర్తి రిజర్వాయర్‌లో గోదావరి జలాల లభ్యత పై ఆయన ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. సుమారు 45 రోజులపాటు మంచినీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం అందుబాటులో ఉందని కమిషనర్ చెప్పారు. గోదావరి కెనాల్ తెరిచే వరకు కాకినాడ ప్రజల అవసరాల మేరకు మంచినీటిని సమృద్ధిగా నిల్వచేసి సరఫరా చేస్తామన్నారు. ఇందుకోసం వేసవి కార్యాచరణ ప్రణాళికను కూడా సిద్ధం చేస్తామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి పై ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని కమిషనర్ పేర్కొన్నారు. ఆయన వెంట వాటర్ వర్క్స్ ఈ ఈ (ఎఫ్ఎసి)ప్రభాకర్, ఏ ఈ ఎమ్.రమేష్ బాబు ఉన్నారు. **పెద్దాపురం** మండల పరిధిలోని 23 గ్రామాల్లో ప్రస్తుత వేసవిలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ నీటి సరఫరా జెఇ బి.అప్పలరాజు అన్నారు.గురువారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని మెట్ట ప్రాంతాలలో ఉన్న ఆనూరు, కొండపల్లి గ్రామాలలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ రెండు గ్రామాలతో పాటు కొన్ని గ్రామాల్లో మంచినీటి బోర్లు, మోటార్లు శుభ్రం చేసేందుకు ఒక్కొక్కటి రూ.14 వేల వ్యయంతో పది బోర్లు రిపేర్లు నిమిత్తం రూ1,40,000 అంచనాతో అధికారులకు నివేదించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే రిపేరు పనులు చేపడతామన్నారు.



వరుపుల రాజా విగ్రహావిష్కరణలో పాల్గొన్న టిడిపి నాయకులు

వరుపుల రాజా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

డిసిసిబి మాజీ చైర్మన్, ప్రత్తిపాడు టిడిపి ఇన్‌చార్జ్ కీర్తి శేషులు వరుపుల రాజా విగ్రహాన్ని ప్రత్తిపాడులో పలువురు మాజీ మంత్రులు గురువారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సంతాప సభలో రాజా లాంటి యువనేతను కోల్పోవడం దురదృష్టక రమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, ప్రత్తిపాటి పుల్లారావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్యేలు వంగలపూడి అనిత జ్యోతుల నెహ్రూ ఎస్ వి ఎస్ వర్మ దాట్ల సుబ్బరాజు పరుపుల సుబ్బారావు ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు, రెడ్డి సుబ్రమణ్యం, జ్యోతుల నవీన్, రాజా సతీమణి సత్యప్రభ పాల్గొన్నారు.

యానాం వార్తలు

పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి - యానాం

కేంద్రపాలిత ప్రాంతం యానాం నియోజకవర్గంలో సమాచార శాఖ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని సోమవారం నిర్వహించారు. స్థానిక యానాం ఫెర్రీ రోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ప్రాంతీయ పరిపాలన అధికారి ఆర్ మునిస్వామి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముగం, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వోచర్ పెయిడ్ సిబ్బందికి జీతాలు పెంచాలి

యానాం పిడబ్ల్యుడిలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ లకు రూ.10వేలు పెంచిన విధంగానే వోచర్ పెయిడ్ సిబ్బందికి కూడా పెంచాలని ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ ఎన్ఎంఆర్‌లకు జరిగిన విధంగానే వోచర్ పెయిడ్ సిబ్బందికి న్యాయం చేయాలని అన్నారు. ఈ మేరకు వోచర్ పెయిడ్ సిబ్బంది సమస్యపై మాట్లాడిన ఎంఎల్‌ఎ కల్యాణసుందరంకు అశోక్ మద్దతు తెలిపారు. అదే విధంగా ఆదిద్రావిడశాఖ నిధులు యానాంకు ఈ ఏడాది అత్యధికంగా ఎందుకు కేటాయించారంటూ డిఎంకె ఎంఎల్‌ఎ శివ తదితరులు ప్రశ్నించగా దీనికి స్పందించిన ఎంఎల్‌ఎ అశోక్ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా యానాంకు ఆదిద్రావిడశాఖ పరంగా నిధులు సరియైన విధంగా రాలేదని దీంతో ఈ ఏడాది నిధులు పెంచారని సమాధానమిచ్చారు.

ఆయుష్ అవగాహన సదస్సులు

యానాం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆజాదీకా అమత్ మహోత్సవంలో భాగంగా స్థానిక అయ్యన్న నగర్ గ్రామంలో కమ్యూనిటీ హాల్‌లో మత్స్యశాఖ అధికారి డి గొంతియ్య పర్యవేక్షణలో మత్స్యకారులకు విష జ్వరాలు, కీళ్ల నొప్పులపై గురువారం ఆయుష్ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయుర్వేదం,హెూమియోపతి డాక్టర్లతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యం అందించారు. కార్యక్రమానికి ఆర్ఏఒ మునిస్వామి పాల్గొని బీపీ పరీక్షలు చేయించుకున్నారు.అనంతరం అయ్యన్న నగర్ మత్స్యకారులకు ఉచిత వైద్యాన్ని అందించారు.

నలుగురు కో-ఆపరేటివ్ స్టోర్స్ కమిటీ డైరెక్టర్లు రాజీనామా

కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ కమిటీలో నలుగురు డైరెక్టర్లు మట్టపర్తి మంగా, నల్ల నాగలక్ష్మి, సుబ్బలక్ష్మి, బేగంలు గురువారం కోపరేటివ్ ఆర్ సి ఎస్ అధికారిని కలిసి రాజీనామా పత్రాలు అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్లో పనిచేస్తున్న ప్రెసిడెంట్ కాలపరిమితి పెంచినందుకు గాను రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. కోపరేటివ్ స్టోర్స్ లో అవకతవకలు ఉన్నాయని ఆరోపించారు. అనంతరం చీఫ్ సెక్రటరీని కలిసి కోపరేటివ్ స్టోర్స్ లో జరుగుతున్న అవకవతలపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పువ్వల శ్రీనివాసరావు, రెడ్డి సుబ్రమణ్యం, జాఫర్, రామకష్ణ, కొక్కిలిగడ్డ రమణ, కోనం రెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.

దత్తత తీసుకున్న రోగుల అవసరాలకు సహాయం అందజేస్తున్న శ్రీనివాస్

టిబి రోగులను దత్తత తీసుకున్న దాడిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి -కోటనందూరు

తుని నియోజకవర్గ వైసిపి యువజన నాయకుడు దాడిశెట్టి శెట్టి శ్రీనివాస్ తన పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రాణా పాయంలో ఉన్నవారికి ఉచితంగా రక్తదానం చేయడంతో పాటు, ప్రధాన మంత్రి టీబీ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో ఉన్న కోటనందూరు, తుని తొండంగి ,తుని రూరల్ ప్రాంతాల్లో ఉన్న టీవీ వ్యాధిగ్ర స్తులకు 235 మంది రోగులను దత్తత తీసుకున్నారు. వీరి సౌకర్యాల కోసం పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఉద్దేశంతో రూ.లక్షా వేలు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేస్తున్న ఫెలోషిప్ సభ్యులు

విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

క్రాప్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం 76 మంది టెన్త్ విద్యార్థు లకు పరీక్షలకు అవసరమయ్యే ప్యాడ్, పెన్, స్కేల్, పెన్సిల్, ఎరేజర్, చాక్ మార్, హాల్ టికెట్ కవర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ సిబిఐ సుకుమార్, సెక్రటరీ ఎం సుధాకర్, మాజీ సెక్రటరీ జి.ఆనంద్ సామ్యూల్, వైస్ ప్రెసిడెంట్ జి.సత్యానందం, టి.కృపావరం, క్రాప్స్ గౌరవాధ్యక్షులు డాక్టర్ జిఆర్ ఇమ్మానియేల్ రాజ్, జి జాన్ మోజెస్ దాస్, డాక్టర్ డిపి డీకే జార్జి మేషన్, డాక్టర్ డిడి గోల్డ్ స్టోన్, ప్రెసిడెంట్ డాక్టర్ లంక పురుషోత్తం దాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యదర్శికి షోకాజ్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు గురువారం రెండో సర్కిల్ పరిధిలోని భాస్కర్ నగర్, శాంతినగర్ ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆక స్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొన్నిచోట్ల చెత్త తొలగింపులో సిబ్బంది అలసత్వాన్ని గుర్తించారు. ఇందుకు కారణమైన అక్కడి శానిటరీ సెక్రటరీ సూర్యకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఆదేశించారు. ఆదివారం కూడా చెత్త సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై సమీక్ష

ప్రజాశక్తి - మండపేట

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం మండపేట పట్టణ, మండల ప్రధానోపాధ్యాయులతో మధ్యాహ్నం భోజనం సమీక్ష సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఉప విద్యాశాఖాధికారి పి.షాలేంరాజు మాట్లాడుతూ 90శాతం మంది విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసేవిధంగా చర్యలు చేపట్టాలని పాఠశాల నందు ప్రతి రికార్డు, రిజిస్టర్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. విద్యార్థుల విద్యా ప్రగతిని సమీక్షిస్తూ పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. మండల విద్యాశాఖాధికారి ఎన్.రామచంద్రరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన పథకం మెనూ అందరికీ కనిపించే విధంగా పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్ఆర్‌కె. రవికుమార్ , జి.వీరన్న , సిహెచ్. శోభావళి, సిహెచ్. రామలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మండపేట విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపిపి ఉండ మట్ల శ్రీనివాసు అన్నారు. గురువారం కేశవరంలో ఎంపిపి పాఠశాల మెయిన్ లోని మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజన నిర్వహణ గురించి తెలుసుకున్నారు. అనంతరం భోజనాన్ని, స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని, నాణ్యమైన భోజనం అందించాలని కార్మికులకు సూచించారు. ఆయన వెంట వైసిపి నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్ తదితరులు ఉన్నారు. **ఉప్పలగుప్తం** పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందించే భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో వండి, వడ్డించాలని సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్ సూచించారు. భీమనపల్లి పంచాయతీ భట్టుపాలెం ఎంపిపి పాఠశాల్లో గురువారం సర్పంచ్ రాజ్ కుమార్ మధ్యాహ్నం భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని హెచ్ఎం ఎస్ సంగీత, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సర్పంచ్ రాజ్ కుమార్ సూచించారు.

ఉప ఎన్నికకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం మండలంలోని నెలపర్తిపాడు గ్రామంలో త్వరలో జరగనున్న ఎంపిటిసి ఉప ఎన్నిక కు సంబంధించి పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని ఎంపిడిఒ కీర్తి స్పందన తెలిపారు. 32 వ పోలింగ్ కేంద్రాన్ని మామిడిగుంట ప్రాథమిక పాఠశాల నందు 6 నుంచి 9 వార్డు ఓటర్లు 868 మంది తోను, 33వ పోలింగ్ కేంద్రం నెలపర్తిపాడు ప్రాథమికోన్నత పాఠశాల్లో 1 నుంచి 4 వార్డుల ఓటర్లు 868 మంది తోను, 34వ పోలింగ్ కేంద్రం కూడా అదే పాఠశాల్లో 5, 10 వ వార్డు ఓటర్లు 625 మంది తోను, అదే ఎంపిటిసి సంబంధించి బాపనయ్య చెరువు గ్రామంలో 1 నుంచి 10వ వార్డుల ఓటర్లు 1154మందితో, 35వ పోలింగ్ కేంద్రం మండల ప్రాథమికోన్నత పాఠశాల్లో ఏర్పాటు చేశారు. మొత్తం నెలపర్తిపాడు ఎంపిటిసి ఓటర్లు 3515 మంది ఉన్నారని ఎంపిడిఒ తెలిపారు.

126 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగర గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య శిబిరంలో గురువారం 126 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు మాట్లాడుతూ పేదలకోసం ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగర పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ డి.రత్నకుమారి డా జె.ప్రియాంక ఆధ్వర్యంలో 126 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, హెల్త్ సూపర్వైజర్ పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు ప్రజలకు వివరించాలని రాజోలు ఎంఎల్‌ఎ రాపాక వరప్రసాదరావు అన్నారు. కరవాకలో గురువారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు తో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. మండల శాఖ అధ్యక్షులు బొలిశెట్టి భగవాన్, జెసిఎస్ మండల శాఖ కన్వీనర్ సిర్రా మణి కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ కటకంశెట్టి ఆదిత్య, జిల్లా వక్ఫ్ బోర్డు కన్వీనర్, ఎండి షరీఫ్, సర్పంచ్ రేకాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ విక్రయాలను అరికట్టేందుకు కృషి

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

సారా తయారీ విక్రయాలను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో మహిళా పోలీసులు కృషి చేయాలని ఎస్ఇబి సిఐ సిహెచ్.అరుణమ్మ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో 19 సచివాలయాల గ్రామాల మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సారా విక్రయాలు జరుగుతున్న తీరుపై చర్చించి క్షేత్రస్థాయిలో వాటిని అరి కట్టాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌సి వి.నాగేశ్వరరావు, సిబ్బంది వి.దేవి ,మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

'నీట్ పీజీ'లో సత్యవాసుకికి 2,083వ ర్యాంకు

ప్రజాశక్తి - మామిడికుదురు



సత్య వాసుకి

నీట్ పీజీ పరీక్షలలో జాతీయ స్థాయిలో మామిడికుదురు కు చెందిన విద్యార్థిని ధూళిపూడి వెంకట సత్య వాసుకి కి 2083 వ ర్యాంకు వచ్చింది. విశాఖపట్నం గాయత్రి వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసి స్వీయ శిక్షణ తోనే ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి దీప్తి విద్యా సంస్థల కరస్పాండెంట్ గా, ఆమె తల్లి లూటుకుర్రు హైస్కూలులో ఉపాధ్యాయురాలు గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ ర్యాంకు సాధించానని ఆమె తెలిపారు.

ఫణిప్రియకు 5,498వ ర్యాంకు

ఆలమూరు నీట్ పీజీ (ఎండీ) ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి జాతీయ స్థాయిలో 5,498 వ ర్యాంకు సాధించిన మండలంలోని పెదపళ్లకు చెందిన గొడవర్తి ఫణిప్రియను గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి గురువారం అభినందించి, ఘనంగా సన్మానించారు.

పథకాల అమలుపై సమీక్ష

ప్రజాశక్తి - మండపేట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో టిడ్కో హౌసింగ్, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి డ్వాక్రా రుణాలు, జగనన్న తోడు తదితర పథకాల అమలుపై లీడ్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ నియోజకవర్గంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లతో గురువారం సమీక్షించారు. రుణాల రికవరీపై బ్యాంకర్ల సందేహాలను నివృత్తి చేశారు. డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రుణసాయం మంజూరు ద్వారా ఇళ్ల నిర్మాణం వేగవంతానికి బ్యాంకర్లు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాజు, డిఆర్‌డిఎ డిపిఎం అన్నపూర్ణ, మెప్మా డిసిఒ శ్రీనివాస్, ఎపిఎంలు రవిరాజా, ధనరాజు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

సత్తిరాజు శ్రీలక్ష్మి, భర్త : ఎస్.వి. సత్యనారాయణ, వయస్సు : 64 సం॥రాలు, డి.నెం.4-1-7, పాత రామ్ నగర్, పోస్టాఫీసు వీధి, నిడదవోలు, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ అను నేను ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నాకు చెందిన **ఒరిజినల్ పాస్ పుస్తకం, దస్తావేజు, టైటిల్ డీడ్ నెం.ఇ-495060 గలవి, తేది.04-03-2023** న జిరాక్స్ నిమిత్తం మా ఇంటి వద్ద నుండి నిడదవోలు బస్‌స్టాండ్ సెంటర్‌కి ఆటోలో వస్తుండగా పోయినది. ఎంతవెదికిననూ దొరకలేదు. కావున ఎవరికైనా దొరికినచో **ఫోన్ నెం.94911 63287**కు తెలియజేయగలరు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, అమలాపురం వారి కోర్టులో

O.S. 315/21

బిట్వీన్:
మల్లాడి సోమాలమ్మ -వాది
AND
పెనుపోతు వెంకట నరసమ్మ, వగైరాలు -ప్రతివాదులు

4వ ప్రతివాది:
మల్లాడి లక్ష్మి, W/o. సత్యనారాయణ, House Wife, 51 సంవత్సరములు, పెదపట్నం లంక, మామిడికుదురు మండలం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

మీపై పై నంబరు దావా వాది పారీఖత్తు నిమిత్తం దావా వేయగా సదరు కోర్టు వారి ఆర్డరు ప్రకారం 4వ ప్రతివాది అయిన మీరు నోటీసు ఆర్డరు చేసియున్నందున ఈ ప్రకటన జారీ చేయడమైనది. సదరు దావా వాయిదా **24-03-2023 సం॥ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై అభ్యంతరములు తెలుపని యెడల మీ పరోక్షమున మీ దావా పరిహరించబడును.

సి.వి.సూర్యనారాయణ
అడ్వకేట్, అమలాపురం

పాస్‌పోర్టు పోయినది

నిడదవోలు మండలం, నిడదవోలు పట్టణం, డి.నెం.13-24-137 కాపురస్తురాలు, **సింహాద్రి దుర్గ, భర్త: శ్రీను** అను నాయొక్క ఎమర్జెన్సీ (ఇసి)నెం.**ఎక్స్366515** ది.11.11.2022న మా యొక్క నిడదవోలు పట్టణం జిరాక్స్ కోసం గణేష్ చౌక్‌కి వెళ్ళుచుండగా దారి మధ్యలో నా యొక్క ఎమర్జెన్సీ (ఇసి) పోయినది. కావున ఎవరికైనా దొరికినచో నాకు అందజేయగలరు.

సింహాద్రి దుర్గ, భర్త: శ్రీను
ఫోన్: 8919053537

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: కాకినాడ

E.A.No. 148/2022, E.A.No. 149/2022 in E.P.No. 229/2019 in O.S.No. 161/2014

బిట్వీన్:
ఎరుసు శ్రీనివాసు
...పిటీషనరు /క్లయిమెంట్
మరియు
1) తాళ్ళపూడి గణేష్ బాబు
...పెయింటిఫ్ /డి. హెచ్. ఆర్
2) కొమ్మోజి రాజ్యలక్ష్మి
3) కొమ్మోజి అనిల్ కుమార్
4) కొమ్మోజి కనక సింధు
...డిఫెండెంట్ /జె.డి.ఆర్స్
...రెస్పాండెంట్లు

2, 3, 4 రెస్పాండెంట్లు:
2) కొమ్మోజి రాజ్యలక్ష్మి, భర్త: లేటు కె.సత్యాజీరావు, డో.నెం. 26-10-5, కంబాలచెరువు దగ్గర, రాజమండ్రి.
3) కొమ్మోజి అనిల్‌కుమార్, తండ్రి: లేటు కె.సత్యాజీరావు, డో.నెం. 26-10-5, కంబాలచెరువు దగ్గర, రాజమండ్రి.
4) కొమ్మోజి కనక సింధు, తండ్రి: లేటు కె.సత్యాజీరావు, డో.నెం. 26-10-5, కంబాలచెరువు దగ్గర, రాజమండ్రి.

పై నెంబరు ఇ.పి.లో క్లయిమెంట్ దాఖలు చేసిన పిటీషన్లు అనగా ఇ.ఎ.నెం. 148/2022 మరియు ఇ.ఎ.నెం. 149/2022లో మీ ముగ్గురికి శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీ హాజరు నిమిత్తం **ది.07-04-2023న వాయిదా వేసియున్నారు. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పైన తెలిపిన కోర్టు వారి ముందు హాజరు అయ్యి మీ ఆక్షేపణలు ఉన్నచో తెలియపరచవలెను.** లేనిఎడల మీపరోక్షమున తీర్మానించబడును అని ఇందుమూలముగా తెలియజేయమైనది.

వాయిదా తేదీ: 07-04-2023, ఉదయం గం॥ 10:30 ని॥లకు

ఇ.గోవిందరెడ్డి
అడ్వకేట్, కాకినాడ.
సెల్: 94401 23169

ప్రకటన

నా క్లయింట్లు అయిన తూర్పుగోదావరి జిల్లా, డో.నెం. 45-47-1, తాడితోట, రాజమండ్రి కాపురస్తులు **బేతాళ వెంకటరమణ గారి కుమారులు (1) బేతాళ శ్రీనివాస్, (2) బేతాళ రాజశేఖర్,** డో.నెం. 59-54-5, గాయత్రి నగర్, మోరంపూడి, రాజమండ్రి కాపురస్తులు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి డో.నెం. 4-5-16/5/1, కొవ్వూరు కాపురస్తులు **గంటా మంగారామ్ గారి భార్య (1) శ్రీమతి గంటా సత్యవాణి, వీరి కుమార్తె (2) గంటా శ్రావ్యాంజని ప్రణతి, దస్తావేజు నెం. 6189/2019, Dt. 28-11-2019, SRO, కొవ్వూరు** ఆస్తిని మా క్లయింట్లు క్రయ అగ్రిమెంటు చేసుకొనియున్నారు. కావున ఈక్రింది తెలిపిన ఆస్తులపై తనఖాలు గాని, కోర్టు కేసులు గాని వారసత్వపు హక్కులు గాని, బ్యాంకు లోనులు గాని ఏవిధమైన అభ్యంతములు ఉన్న యెడల 7 రోజులలో వారి అభ్యంతరములను వ్రాతపూర్వకంగా తగిన ఆధారముల కాపీలతో ఈక్రింది అడ్రస్‌కి తెలియజేయవలెను. గడువు తేది తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును మరియు ఆస్తిని బైండు చేయవని, గడువు తేదీలోపు ఏవిధమైన అభ్యంతరములు రానియెడల నా క్లయింట్లు పైన తెలిపిన ఆస్తిని నిర్వివాద నిష్పేచీ ఆస్తి అని నా క్లయింట్లు కొనుగోలు చేయుదురని తెలియజేయడమైనది.

ఆస్తి షెడ్యూలు

పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా, శ్రీ కొవ్వూరు సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో చేరిన కొవ్వూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన కొవ్వూరు గ్రామం తాలూకు పాత వార్డు నెం. 15రుకు ప్రస్తుతం 20వ వార్డు నందలి డోర్ నెం. 15-9-57 రు ఇంటికి సమీపమున గల లే-అవుట్ నెం. 162/93 రు దాఖలా ప్లాట్ నెం. 56రు గల చ॥గ॥ 360లు స్థలము, ఇందలి డోర్ నెం. 15-9-97 రుకు అసెస్మెంట్ నెం. 1076010396 రు జి+1 ఆర్.సి.సి. బిల్డింగ్ స్థలం వగైరాలు యిందుకు హద్దులు.

తూర్పు: ప్లాట్ నెం. 57రు స్థలము - అ. 60-0లు. **దక్షిణం:** రోడ్డు నెం. 18రు గల అరువది అడుగుల వెడల్పు గల బైపాస్ రోడ్డు - అ. 54-0లు. **పడమర:** రోడ్డు నెం. 7రు గల ముప్పది మూడు అడుగుల వెడల్పు గల బైపాస్ రోడ్డు - అ. 60-0లు. **ఉత్తరం:** ప్లాట్ నెం. 55రు గల మేడిచర్ల రామచంద్రరావు గారి ప్రహరీ గోడ - అ. 54-0లు. యీ హద్దుల మధ్య చ॥గ॥ 360లుకు చ॥మీ॥ 301.030 ర్లు స్థలమున్నూ, యిందుల తలుపులు, ద్వారబంధములు, కిటికీలు, అలమార్లు వగైరా పైకప్పుతో నున్నటువంటి ఆర్.సి.సి. బిల్డింగ్ వగైరా యావత్తు కట్టడములున్నూ, సదరాస్తిలో వున్న నీటికుళాయి, ఎలక్ట్రిక్ సర్వీసు కనెక్షనున్నూ మరియు లోగడ నుండి రివాజుగా నున్నటువంటి యావత్తు రివాజు దారిమార్గపు రాకపోకల హక్కులున్నూ, నీటి హక్కులున్నూ మామూలు యాజిమెంటు హక్కులతో సహా.

ఎం.సూర్యమోహనరావు
బి.మహేష్‌కుమార్, అడ్వకేట్స్
డో.నెం.45-50-11, తాడితోట
రాజమండ్రి
రాజమండ్రి
16-3-2023
సెల్:8885551188